AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
10-9-2026 (Thursday) MAIN EDITION

## వీవో నుంచి మరో ఫోన్..




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** వివో మిడ్ రేంజ్‌లో మరో కొత్త స్మార్ట్ ఫోన్‌ను తీసుకువచ్చింది. టీ సిరీస్‌లో ఐదో మోడల్ వివో టీ5 ను భారత మార్కెట్‌లో విడుదల చేసింది. అధునాతన ఫీచర్లతో తీసుకువచ్చిన ఈ ఫోన్‌లో మీడియాటెక్ డైమెన్సిటీ 7500 టర్బో ప్రాసెసర్ , 7,050 ఎంఏహెచ్ బ్యాటరీ ఉన్నాయి. వెనక వైపు 50 ఎంపీ సోనీ ఐఎంఎక్స్882 ప్రధాన కెమెరా, 8 ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ కెమెరా ఇచ్చారు. 32 ఎంపీ ఫ్రంట్ కెమెరా ఉంది.

## ఎల్సీసీ జీఎంపీ పైపైకి..




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** నీటిపారుదల, నీటి సరఫరా ప్రాజెక్టులపై పనిచేసే ఈపీసీ కంపెనీ ఐపీవోకు వచ్చింది. ఈ కంపెనీ జీఎంపీ రోజురోజుకు పెరుగుతూ ఇన్వెస్టర్లను ఆకర్షిస్తోంది. మార్కెట్ నుంచి రూ. 427.14 కోట్లు సమీకరించాలన్న లక్ష్యంతో ఎల్ సీసీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ కంపెనీ ఐపీవోకు వచ్చింది. ఐపీవో సబ్‌స్క్రిప్షన్ సెప్టెంబర్ 9న ప్రారంభమైంది. 11 వరకు అందుబాటులో ఉంటుంది. ఐపీవో జీఎంపీ 34 శాతం ఉంది.

### ఆయుధాల చోరీ కేసు.. ముగ్గురు ఆర్మీ అధికారుల అరెస్ట్



**అక్షరటుడే, సికింద్రాబాద్:** హైదరాబాద్ నగరంలోని బొల్లారంలో గల మద్రాస్ రెజిమెంట్ ఆర్మీ స్థావరం నుంచి ఆయుధాలు చోరీ అయిన విషయం తెలిసిందే. ఈ కేసులో ముగ్గురు ఆర్మీ అధికారులను అరెస్ట్ చేశారు. నిందితులు మూడు నెలలుగా ఆయుధాలను మాయం చేశారు. సీసీ కెమెరాలు ఆఫ్ చేసి చోరీ చేశారు.

### సెలవు కోసం తోటి విద్యార్థిపై హత్యాయత్నం



**అక్షరటుడే, ఏపీ :** ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లాలో దారుణ ఘటన చోటు చేసుకుంది. పాఠశాలకు సెలవుల కోసం ఓ విద్యార్థిపై తోటి విద్యార్థులు హత్యాయత్నం చేశారు. కంభంవారిపల్లి మండలం గ్యారంపల్లె గురుకుల పాఠశాల వసతి గృహంలో చదువుతు న్న ఓ విద్యార్థిని అదే గదిలో ఉంటున్న మరో ఇద్దరు చంపేందుకు యత్నించారు.

### ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి రూ.కోటి బీమా



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో పాటు పెన్షనర్లకు ప్రభుత్వం అందిస్తున్న రూ.కోటి ఉచిత ప్రమాద బీమా పథకం దేశంలోనే ప్రథమమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో ప్రకటించారు.

## రేవంత్ రెడ్డివి డైవర్షన్ పాలిటిక్స్ : హరీశ్‌రావు



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. 22A మీద, ఉద్యోగుల సమస్యలు, రైతులు, నిరుద్యోగుల సమస్య మీద చర్చ జరగకుండా సీఎం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ నడిపే ఫేక్ అకౌంట్‌ను పట్టుకొని ఒక ముఖ్యమంత్రి అసెంబ్లీలో మాట్లాడే దౌర్భాగ్య పరిస్థితికి వచ్చారని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఫేక్ అకౌంట్ మీద తక్షణమే విచారణ జరిపించి అరెస్ట్ చేయాలని డిమాండ్‌చేశారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టించినందుకు రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పాలన్నారు. ఆయనపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు కూడా ఇస్తామన్నారు.

## సీఎం విజయ్‌పై స్టాలిన్ విమర్శలు



**అక్షరటుడే, తమిళనాడు:** తమిళనాడు రాజకీయాల్లో ముఖ్యమంత్రి విజయ్, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. అసెంబ్లీలో సీఎం విజయ్ తనపై చేసిన మిసా చట్టం, గత పరిణామాల ప్రస్తావనపై స్టాలిన్ తీవ్రంగా స్పందించారు. అసెంబ్లీని అనవసర వివాదాలకు వేదికగా మార్చొద్దని హితవు పలికారు. సోషల్ మీడియా రీల్స్, ప్రచారాలతో పరిపాలనా వైఫల్యాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని, "మీరు సినిమాల షూటింగ్‌లా ప్రభుత్వాన్ని నడుపుతున్నారు" అంటూ సీఎం విజయ్‌పై స్టాలిన్ మండిపడ్డారు.




**రాష్ట్రంలో అనుముల సోదరుల దోపిడీ కొనసాగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. వారి దోపిడీపై నిలదీస్తామనే సీఎం రేవంత్‌రెడ్డి తమను శాసన సభ నుంచి సస్పెండ్ చేశారని పేర్కొన్నారు. సీఎం సోదరుడు కొండల్‌రెడ్డికి తుక్కుగూడలో ప్రభుత్వం కేటాయించిన భూమిని బీఆర్ఎస్ బృందం గురువారం పరిశీలించింది.**

**- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

# అనుముల సోదరుల దోపిడీ

**■ ప్రశ్నిస్తామనే సభ నుంచి సస్పెండ్ ■ ఫ్యూచర్ సిటీ నిలవదు ■ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**


పేదవారిని కొట్టాలి.. పెద్ద వాళ్లకు పెట్టాలి అన్నట్లు రాష్ట్రంలో పరిస్థితి ఉందని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికలకు ముందు ఎన్నో హామీలిచ్చారని, ఒక్కటి కూడా నిలుపుకోలేదని పేర్కొన్నారు. సీఎం భూ దోపిడీపై ప్రశ్నిస్తే తమను సస్పెండ్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ తమ్ముడు పటాన్‌చెరులో ఓ కంపెనీ పెట్టుకున్నారని, అంత చిన్న కంపెనీకి ఇక్కడ భూములు ఇచ్చారన్నారు. కొండల్ రెడ్డి కంపెనీ టెసెరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌కు రూ.200 కోట్ల విలువైన భూమిని కేవలం రూ.7 కోట్లకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టబెట్టిందన్నారు.

### ఇదేనా ప్రజాపాలన

అమెరికా పర్యటనలో సొంత సోదరులతోనే ఒప్పందాలు చేసుకొని రేవంత్ రెడ్డి పెట్టుబడులు తెస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. అనంతరం వారికి భూములు కట్టబెడుతున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. అనుముల జగదీశ్వర్ రెడ్డికి రూ.1000 కోట్లు, అనుముల కొండల్ రెడ్డికి రూ.250 కోట్లు ఇవ్వడమేనా ప్రజాపాలన అని ప్రశ్నించారు. అనుముల అన్నదమ్ముల దోపిడీ గురించి బీజేపీ ఎందుకు మాట్లాడటం లేదన్నారు. ఇజ్రాయెల్‌తో ఒప్పందం చేసుకుంటే రాహుల్ గాంధీ మోదీని ప్రశ్నించారని, అదే రేవంత్ రెడ్డి ఇజ్రాయెల్‌తో ఒప్పందం చేసుకుంటే బీజేపీ ఎందుకు మౌనంగా ఉందన్నారు. ఇప్పుడు రేవంత్ రెడ్డిని చూసి పొంగులేటి కూడా రాఘవ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ అని స్టార్ట్ చేశారన్నారు. దోచుకున్న డబ్బులను దాచుకోవడానికి వారికి స్థలం సరిపోవడం లేదన్నారు.

### ఫ్యూచర్ సిటీ మాయ

ఫ్యూచర్ సిటీ అనేది మాయ అని, భవిష్యత్‌లో అది నిలవదని కేటీఆర్ పేర్కొన్నారు. గతంలో ఫార్మా సిటీ పేరు మీద షరతులతో భూసేకరణ జరిగిందన్నారు. ఆ భూముల్లో వేరే సిటీలు పెడితే రద్దు అవుతాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫ్యూచరే లేని సీఎం తన అన్నదమ్ముల కోసం ఆడుతున్న నాటకంలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన వారు బలిపశువులు కావొద్దని హితవు పలికారు. ఇక్కడ జరుగుతున్న రియల్ ఎస్టేట్ మాఫియాలో ఇరుక్కుంటే, తాము ప్రభుత్వంలోకి వచ్చాక మొట్టమొదట నష్టపోయేది వారే అన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఊరూరా సదస్సులు పెట్టి ఫ్యూచర్ సిటీ మాయ గురించి చెప్తామని తెలిపారు.



## డీసీఎంలో మంటలు.. డ్రైవర్ సజీవ దహనం

**అక్షరటుడే, మహబూబ్‌నగర్ :** మహబూబ్‌నగర్ జిల్లాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఓ డీసీఎం వ్యాన్‌లో మంటలు అంటుకొని పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో డ్రైవర్‌తో పాటు డీసీఎంలో ఉన్న 200 మేకలు సజీవ దహనం అయ్యాయి. 200లకు పైగా మేకల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదం కారణంగా డీజిల్ ట్యాంక్ పేలి, నిప్పురవ్వలు చెలరేగి మంటలు అంటుకున్నాయి. దీంతో డ్రైవర్ అక్కడికక్కడే మరణించగా, వాహనంలో తరలిస్తున్న మేకలన్నీ సజీవ దహనం అయ్యాయి.

## మేనల్లుడిని పార్టీ నుంచి తొలగించిన మాయవతి

**అక్షరటుడే, యూపీ :** బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షురాలు మాయవతి కీలక నిర్ణయం తీసుకున్నారు. తన మేనల్లుడు ఆకాష్ ఆనంద్‌ను పార్టీ బాధ్యతల నుంచి తప్పించారు. గతంలోనే ఆయనను పార్టీ బాధ్యతల నుంచి తప్పించారు. ఆనంద్ మామగారైన అశోక్ సిద్ధార్థ్ రాజకీయాల నుంచి తప్పుకుంటే తిరిగి ఆనంద్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తామని బుధవారం చెప్పారు. దీంతో సిద్ధార్థ్ గురువారం ఉదయం రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. అయినా కూడా మాయవతి ఆకాశ్ ఆనంద్‌ను పార్టీ నుండి కూడా తొలగిస్తున్నట్లు ప్రకటించారు.





## కోటి మంది మహిళలకు రూ.లక్ష వడ్డీ లేని లోన్


**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం మహిళల కోసం ఓ అద్భుతమైన ఆర్థిక పథకాన్ని ప్రతిపాదించింది. రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు ఒక్కొక్కరికి రూ.1 లక్ష వరకు వడ్డీ లేని రుణ సదుపాయం కల్పించేలా కసరత్తు చేస్తోంది. 'ఉత్తరప్రదేశ్ మహిళా ఉద్యమి క్రెడిట్ యోజన' పేరుతో తీసుకొస్తున్న ఈ పథకం ద్వారా మహిళలు సొంతంగా చిన్న వ్యాపారాలు ప్రారంభించడంతో పాటు, ఇప్పటికే ఉన్న వ్యాపారాలను మరింత విస్తరించుకునేందుకు పెద్ద ఎత్తున ఆర్థిక సాయం అందనుంది.

## చాకలి ఐలమ్మకు ఘన నివాళి

**అక్షరటుడే, హైదరాబాద్ :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని రవీంద్రభారతిలో నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు వీ హనుమంతరావు, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. ఐలమ్మ చిత్రపటానికి మంత్రులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



## జోర్డాన్‌లోని యూఎస్ స్థావరంపై ఇరాన్ దాడి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** జోర్డాన్‌లోని అమెరికన్ వైమానిక స్థావరంపై బుధవారం రాత్రి ఇరాన్ దాడులు చేసింది. ఈ ఘటనలో అనేక అమెరికా సైనిక విమానాలు దెబ్బతిన్నాయని సమాచారం. అమెరికాకు చెందిన 'వార్‌హాగ్' అని పిలువబడే ఒక ఏ10 థండర్‌బోల్ట్ విమానం దెబ్బతింది. మువఫ్ఫాక్ సాల్టీ వైమానిక స్థావరంపై ఇరాన్ దాడులు చేసింది. సుమారు 8 ఎఫ్15 విమానాలు స్వల్పంగా తిన్నట్లు సమాచారం. ఇరాన్ దాడులను ఎదుర్కోవడానికి జోర్డాన్‌లోని అమెరికన్ దళాలు 30కి పైగా క్షిపణులను ప్రయోగించాయి.

## రాత్రి ఒంటిగంట వరకు మెట్రో రైళ్లు



**అక్షరటుడే, హైదరాబాద్ :** గణేశ్ నిమజ్జనం సందర్భంగా హైదరాబాద్‌లో సెప్టెంబర్ 25న మెట్రో సేవలు అర్ధరాత్రి 1 గంట వరకు, ఎంఎంటిఎస్ రైళ్లు రాత్రంతా నడుస్తాయని అధికారులు తెలిపారు. నిమజ్జనం రోజు ప్రజా రవాణాపై అధికారులు చర్యలు చేపట్టారు. భక్తులు, ప్రయాణికుల రాకపోకలను సులభతరం చేయడానికి రాత్రి 1 గంట వరకు మెట్రో రైలు సేవలను నడపడానికి ప్రణాళికలు రచిస్తున్నారు. ఎంఎంటీఎస్ రైళ్లను రాత్రిపూట కూడా నాంపల్లి, లక్డీకాపుల్, ఖైరతాబాద్, సంజీవయ్య పార్క్, జేమ్స్ స్ట్రీట్, బేగంపేట్ స్టేషన్ల నుంచి నడపనున్నారు.